క్లుప్తంగా

ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా సతీశ్

అభినందించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో సతీశ్, అనిల్‌కుమార్‌గౌడ్

బషీరాబాద్: మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నీళ్లపల్లికి చెందిన సతీశ్ ఎన్నికయ్యారు. అక్టోబర్‌లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పోటీలో సతీశ్ ఘనవిజయం సాధించడంతో జిల్లా నాయకత్వం అధ్యక్షుడిగా నియమించారు. జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా అనిల్‌కుమార్ గౌడ్ గెలుపొందారు. దీంతో ఇరువురూ ఆదివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలో యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం సతీశ్, అనిల్‌కుమార్‌గౌడ్‌ను అభినందించారు. అలాగే బుయ్యని శ్రీనివాస్‌రెడ్డిని కూడా వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కలాల్ నర్సిములు, మాణిక్‌రావు, మోహన్, రాజు, నవల్గా గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఎర్రగోవింద్‌తండాలో కాళిమాత ఆంజనేయ స్వామి పూజలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రగోవింద్‌తండాలో కాళి మాత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన, పూజా కార్యక్రమాలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని ప్రతిఒక్కరూ దైవభక్తి పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్రా, హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి



కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలో క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతుందన్నారు. కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పథకాలకు, అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. వికారాబాద్‌ను కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామస్వామి, శ్రీనివాస్, క్రాంతి యువజన సంఘం అధ్యక్షుడు నాగేశ్, ప్రతినిధులు నాగరాజు, శ్రీనివాస్, గోపాల్, యాదయ్య, మహేందర్, అంజయ్య, భాస్కర్, జ్ఞానేశ్వర్, ప్రసాద్, వినయ్, రాజు పాల్గొన్నారు.

బాలుడికి పరామర్శ

షాద్‌నగర్‌రూరల్: పాఠశాల బస్సు అదుపుతప్పిన ఘటనలో గాయపడిన విద్యార్థి నందీశ్వర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆస్పత్రికి చేరుకొని బాలుడిని పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలుడు త్వరగా కోలుకునే విధంగా మెరుగైన వైద్యసేవలను అందించాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడతానని, మీకు ఏమైనా ఇబ్బంది కలిగితే సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్ బాబర్, డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఎండీ.ఇబ్రహీం, బాల్‌రాజ్‌గౌడ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా విజయోత్సవాలు

- గ్రామాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యటనకు తరలి వచ్చిన జనం
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



పెద్దేముల్ సంబరాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పాలన పూర్తి కావడంతో ప్రభుత్వం విజయోత్సవ సంబరాలు వారం రోజుల పాటు అట్టహాసంగా నిర్వహించింది. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన సంబరాలు ఆదివారం వరకు అట్టహాసంగా నిర్వహించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలకు ప్రజలు నీరాజనం పలికారు. గ్రామ పంచాయతీ పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యేను ప్రజలు సాదారంగా ఆహ్వానించారు. మరోవైపు గ్రామాలకు వెళ్లిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని రైతుబంధు పథకం అమలు చేయాలి, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రజల నుంచి వినతులు వచ్చాయి. సంక్రాంతి పండుగకు ముందే రైతుల ఖాతాల్లో డబ్బులు వేసి రైతులకు భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. అందులో భాగంగానే హామీలు ఆలస్యమవుతున్నాయన్నారు. మూడు నెలల వ్యవధిలో సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అమలవుతాయని ఎమ్మెల్యే ప్రకటించారు.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యే..

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి 8రోజుల పాటు తాండూరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పెద్దేముల్ మండలంలో పర్యటించి పర్యటనను ముగించారు. సోమవారం జరగనున్న శాసనసభా సమావేశాలకు ఆయన హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాండూరు నియోజకవర్గంలో ప్రజలు ప్రధానంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు కోరుతున్నారన్నారు. మరోవైపు వ్యవసాయానికి సాగునీటిని అందించేందుకు కోట్‌పల్లి, జుంటిపల్లి, శివసాగర్ ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని అందించాలని ప్రజల నుంచి డిమాండ్లు వచ్చాయన్నారు. త్వరలోనే ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు మొదలు పెడతామన్నారు. తాండూరు ప్రాంతంలో కంది పంట అధికంగా సాగవుతుండటంతో తాండూరులో కంది బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయం మరోసారి అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఆయన తెలిపారు.



బంట్వారం: సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం: ఎమ్మెల్యే

బంట్వారం: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజాపాలన విజయోత్సవాల వేడుకలో భాగంగా ఆదివారం రుక్మాపూర్‌లో కోట్‌పల్లి మండలానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సహాయం కోసం సీఎం సహాయ నిధి ఉపయోగపడుతుందన్నారు. అర్హులందరూ ఆపద సమయంలో దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ వర్తింపజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అంజయ్య, మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నక్కల బందయ్య తదితరులు పాల్గొన్నారు.

సమానత్వమే సనాతన ధర్మం

సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశంకర్ స్వామీజీ



పాదాలు కడుగుతున్న శ్రీశంకర్ స్వామీజీ

తాండూరు టౌన్: సమానత్వమే సనాతన ధర్మమని శ్రీ మాణికేశ మహాసంస్థాన్ పీఠాధిపతి, తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ శంకర్ స్వామీజీ అన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్లో 108 మంది దళిత సామాజిక వర్గానికి చెందిన సువాసినులకు (ముత్తయిదువులు) ఆయన పాదపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మశాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్ని కూడా కుల, జాతి భేదాలు అనేవి సనాతన ధర్మంలో లేవని చెబుతున్నాయన్నారు. స్త్రీలు దేవతాశక్తి స్వరూపులని వారిని గౌరవించాలని సనాతన ధర్మంలో వివరించారన్నారు. 108 దళిత ముత్తయిదువులకు పాదపూజ గావించడం చరిత్రలో తొలిసారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, స్వామీజీలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



అనంతగిరి: అయ్యప్ప స్వామికి అభిషేకం చేస్తున్న స్వాములు



దోమ: బొంపల్లిలో అయ్యప్ప స్వామికి పడి పూజ నిర్వహిస్తున్న స్వాములు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని చౌదరికాలనీలో ఆదివారం నవీన్ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. వినోద్ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా రవిపంతులు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన భజనతో ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అనంతరం 18 మెట్లకు ప్రత్యేక పూజల అనంతరం నైవేద్యం సమర్పించి ప్రత్యేక హారతి ఇచ్చారు. చివరగా అయ్యప్పలకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, బీజేపి జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోశ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు రాంచంద్రారెడ్డి, డాక్టర్ ముద్ద దీప భక్తవత్సలం, కౌన్సిలర్ గోపాల్, మోముల రాజ్‌కుమార్, గురుస్వాములు నర్సింలుగౌడ్, గౌరీశంకర్, శంకరప్ప, లింగం అయ్యప్పలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దోమలో..

దోమ: బొంపల్లి గ్రామంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజను వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బంటు నర్సింహులు స్వామి తన నివాసంలో గురుస్వామి మల్లికార్జున్ స్వామితో జరిపించారు. ఈ మహా పడిపూజ మహోత్సవానికి ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణ, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్వాములు పాల్గొన్నారు.

నేడు ఓగిపూర్‌లో సర్వే

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఓగిపూర్ గ్రామంలో వివాదస్పదమైన సర్వే నెంబర్ 65కు సంబంధించి నాపరాతి గని భూమిని సర్వే నిర్వహిస్తున్నట్లు మైన్స్ ఏడీ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు మైన్స్, రెవెన్యూ అధికారులతో సంయుక్త సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే నిర్వహించే ప్రదేశంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయించాలని డీఎస్పీని వారు కోరారని పేర్కొన్నారు.

నిర్లక్ష్య ధోరణి వీడాలి

బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి శేషిపాల్

అనంతగిరి: జిల్లాలోని గురుకులాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి శేషిపాల్, జంగయ్య డిమాండ్ చేశారు. నవంబర్ 30 నుంచి నేటివరకు జిల్లాలో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో గురుకుల బాట చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమయ్యిందని మండిపడ్డారు. పేద పిల్లలకు సకాలంలో దుప్పట్లు ఇవ్వకపోవడం వల్ల వారు చలికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెను ప్రకారం భోజనం అందించాలని డిమాండ్ చేశారు. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో చాలీచాలని వసతులతో మగ్గుతున్నారన్నారు. ఇప్పటికైన సీఎం ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కళాశాల నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్నేహితుడు హైదరాబాద్‌కు చెందిన సూరి రూ.20లక్షల విరాళాన్ని అందజేశారు. దాదాపు రూ.10కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కళాశాల నిర్మాణానికి ఎమ్మెల్యే కోరిక మేరకు సూరి తనవంతుగా విరాళం అందించారు. సూరి తండ్రి వెంకటసుబ్బయ్య పేరిట రూ.20లక్షలను కళాశాల అభివృద్ధి కమిటీ ఖాతాలో ఆర్టీజీఎస్ ద్వారా జమచేశారు. నిరుపేదల విద్యార్థుల చదువుకు ఎమ్మెల్యే చేస్తున్న నిస్వార్థ సేవ ఎంతో గొప్పదని కొనియాడారు. భావి తరాలకు గుర్తుండిపోయే ఈ కళాశాల నిర్మాణంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అడిగి వెంటనే సూరి ముందుకొచ్చి ఇంత పెద్ద విరాళాన్ని అందించడం హర్షనీయమని ఎమ్మెల్యే అభినందించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు, పట్టణాల అభివృద్ధి సాధ్యమవుతుందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పానుగంటి సురేందర్ అన్నారు. ఆదివారం షాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల వెలువడిన యూత్ కాంగ్రెస్ ఫలితాల్లో 289 ఓట్ల మెజార్టీతో మండల అధ్యక్షుడిగా గెలుపొందానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పదని, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు ఆరు గ్యారంటీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

పచ్చని హారం.. ఇండాపూర్ మార్గం



రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

దౌల్తాబాద్: రెండు వైపులా పచ్చని చెట్లతో ప్రకృతి సోయగం, స్వచ్ఛమైన గాలి, పక్షుల కిలకిలారావాలు రోడ్డుకిరుపైలా చెట్లు ఆహ్లాదకరంగా చూపరులను కనువిందు చేస్తుంది. మండలంలోని ఇండాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా అధికారులు మొక్కలు నాటించారు. ఇప్పుడు అవి పెరిగి పచ్చని హారంగా మారాయి. ఈ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులకు ఎంతో ఆహ్లాదానిస్తున్నాయి. వాహనదారులు కాసేపు అక్కడ సేదతీరి వెళుతున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏ వారసులు

అనంతగిరి: వీఆర్ఏ వారసులకు కారుణ్యనియామకాలు చేపట్టాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వీఆర్ఏ జేఏసీ జిల్లా నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం వీఆర్ఏ వ్యవస్థను ఇతర శాఖలలో విలీనం చేసిందని, జీవో నంబర్ 81 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. 2020 సెప్టెంబర్ 9న అసెంబ్లీలో వీఆర్ఏలకు పే స్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి ఆ హామీలను అమలు చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. 80 రోజులు వీఆర్ఏల ధర్నా అనంతరం సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి జీవో నంబర్ 81, 85ను తీసుకొచ్చారన్నారు. ఈ జీవో ప్రకారం వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తున్న వారిని ఇతర శాఖలకు బదిలీ చేశారని గుర్తు చేశారు. కానీ వయస్సు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించడంలో ఆసక్తి కనబరచలేదన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వీఆర్ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇచ్చి ఆదుకోవాలని స్పీకర్‌తో మొర పెట్టుకున్నారు. అనంతరం స్పందించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ వీఆర్ఏ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. స్పీకర్‌ను కలిసిన వారిలో వీఆర్ఏ జేఏసీ అధ్యక్షుడు పూజారి శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

దుద్యాల్: మండల కేంద్రం నుంచి అలిఖాన్‌పల్లికి వెళ్లే మార్గంలో ఓ వాహనానికి ప్రమాదం తప్పింది. ఆదివారం నాచారం గ్రామం నుంచి దుద్యాల్‌లో నిర్వహించిన సదర్ పండుగా ఉత్సవాలకు డీజే వాహనం వస్తున్నక్రమంలో అది మార్గ మధ్యలో రోడ్డు నిర్మాణానికి పోసిన మట్టిలో ఇరుక్కుపోయింది. దీంతో అది ఒకవైపు ఒరిగింది. దీన్ని గమనించిన డ్రైవర్ అప్రమత్తమై వెంటనే వాహనాన్ని నిలిపివేశాడు. మరొక వాహనం సహాయంతో దాన్ని బయటికి తీశారు.



మట్టిలో ఇరుక్కుపోయిన వాహనం

కేరెళ్లిలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీ



నూతన కార్యవర్గం

ధారూరు: ధారూరు మండల పరిధిలోని కేరెళ్లి గ్రామంలో ఆదివారం నూతన ముదిరాజ్ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొంకలి శ్రీను ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా సింగం హరికృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ యాదయ్య ముదిరాజ్, కోశాధికారిగా రాము ముదిరాజ్, 5గురు కమిటీ సభ్యులుగా నియమించబడ్డారు.

శివాజీకి ఆధ్యాత్మిక సేవా పురస్కారం

కేశంపేట: అద్వైత చైతన్య జాగృతి ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన శివాజీకి ఆదివారం ఆధ్యాత్మిక సేవా పురస్కారాన్ని అందించారు. హైదరాబాద్‌లోని హబ్సిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో గీతవధాన కళానిధి గీతచార్య యండవల్లి మోహన్‌రావు, సంస్థ చైర్మన్ కూర్ర దుర్గారావులు శివాజీని సన్మానించి ఆధ్యాత్మిక సేవా పురస్కారంతో పాటు ప్రశంస పత్రం అందించారు.

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల యూత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన నాయకులు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అందె మోహన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పీసీసీ అధ్యక్షుడు దిశానిర్దేశం చేశారన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు సేవకులుగా పని చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు పార్టీలో తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీకి యువ నాయకుల అవసరం ఎంతైనా ఉందని, యువతకు పార్టీ ప్రాధాన్యతనిస్తుందన్నారు. సబ్బండ వర్గాల ప్రజలకు సమన్యాయం అందించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల శ్రీనాథ్, అసెంబ్లీ అధ్యక్షుడు పులిమామిడి రాజేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సాయివంశీ, నాయకులు వంశీగౌడ్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నవీన్, అజయ్, రాహుల్, ప్రవీణ్‌కుమార్, లడ్డూ, సాయి, శ్రీను, వేణు, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కొడంగల్ రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని కాచిగూడలో నిర్వహించిన 78వ ఎస్టీయూ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లులతోపాటు సీపీఎస్ రద్దు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేస్తున్న మెడికల్ రియింబర్స్‌మెంట్ పరిమితిని రూ.2లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్